క్లుప్తంగా

పంచారామ క్షేత్రానికి రూ.1,00,116 విరాళం


దాత అప్పలరాజుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక గునుపూడి పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానానికి విశాఖ జిల్లా భీమిలి మండలం రాజులతాళ్లవలస గ్రామానికి చెందిన దాట్ల సూర్య అప్పలరాజు రూ.1,00,116 శాశ్వత అన్నదానం నిమిత్తం విరాళంగా అందజేశారని ఈఓ డి.రామకృష్ణం రాజు తెలిపారు. తొలుత అప్పలరాజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకి స్వామివారి చిత్రపటాన్ని అర్చకులు అందజేశారు.

సేల్స్ ట్యాక్స్‌పై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న జగదీష్‌బాబు

భీమవరం: వ్యాపారస్తులు సకాలంలో ట్యాక్స్ రిటర్న్స్‌దాఖలు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక సేల్స్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పి.జగదీష్‌బాబు అన్నారు. శనివారం భీమవరం క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సేల్స్‌ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్‌టెంట్స్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాపారులు, హోల్‌సేల్ డీలర్స్ వ్యాపార నిర్వహణ, సేల్స్ ట్యాక్స్ రిటర్న్స్‌పై పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో అశీష్‌అగర్వాల్, రామరాజు, శ్రీనివాసరాజు, రవికుమార్, వీవీఎస్ రాజు, కేవీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూర్తిరాజు సేవలు వెలకట్టలేనివి


మూర్తిరాజుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యాదాత, గాంధేయవాది చింతలపాటి సీతారామ చంద్ర వరప్రసాద్ మూర్తిరాజు విద్యాసేవలు వెలకట్టలేనివని భూపతిరాజు సత్యనారాయణరాజు అన్నారు. శనివారం మూర్తిరాజు 105వ జయంతి సందర్భంగా స్థానిక అద్దవంతెన వద్ద మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, మాజీ కార్యదర్శి కలిదిండి గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ దాతృత్వానికి మూర్తిరాజు మారుపేరని, దేశ భక్తుల పేరిట విద్యాలయాలు స్థాపించారని, వీటిలో భీమవరంలో రెండు కాలేజీలు, మూడు హైస్కూల్స్ ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కలిదిండి వర్మ, చెరుకువాడ రంగసాయి, రాధాకృష్ణమూర్తి, వెంకటపతిరాజు, దంతులూరి గోపి, గొట్టుముక్కల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

విప్, ఎమ్మెల్యే శ్రీనివాస్


మునిసిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

భీమవరం: దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా జనరంజక పాలన అందిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన భీమవరంలో విలేకర్లతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో భాగంగా సీఎం జగన్ జనవరి నుంచి పింఛన్ రూ.3 వేలు చేయడానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు వృద్ధులు, వితంతువులకు పింఛన్ రూ.2,750 పంపిణీ చేయడానికి తీసుకున్న నిర్ణయం ప్రజల పట్ల సీఎం జగన్‌కు ఉన్న అంకిత భావం అవగతమవుతుందని చెప్పారు. ఎన్నిక హామీలను దాదాపు 100 శాతం అమలుచేసిన ఘనత దేశంలో జగన్‌కే దక్కుతుందన్నారు. పింఛన్ సొమ్ము పెంపుతో జిల్లాలో దాదాపు 3,24,144 మందికి అదనపు లబ్ధి చేకూరుతుందని శ్రీనివాస్ వివరించారు. కరోనా సమయంలో ఆర్థిక కష్టాలు ఎదురైనప్పటికీ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి స్థలాలు పంపిణీ చేసి ఇళ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. పథకాల అమలులో అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హులకు నేరుగా లబ్ధి చేస్తున్నారని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మభ్య పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధించాలంటే రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని శ్రీనివాస్ కోరారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

భీమవరం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి మునిసిపల్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ ఎం శ్యామల, ఎంఈ త్రినాథరావు, డీఈలు అప్పలరాజు, రహీం, శ్రీనివాస్‌లతో పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా పట్టణంలో సుమారు రూ.90 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తిచేశామని తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనులకు ఇటీవల అనుమతులు లభించినట్టు చెప్పారు. పట్టణంలోని ఇప్పటికే అన్ని వార్డుల్లో అనేక అభివృద్ధి పనులు పూర్తిచేయగా ఇంకా అనేక పనులు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. తాజాగా తాను పట్టణంలో పర్యటించగా ప్రజలు కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, కొత్తగా 25 పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి మునిసిపల్ ప్రత్యేక అధికారి, ఆర్డీఓ పి.శ్రీనివాసులురాజుకు పంపడంతో మూడు పనులకు తక్షణం ఆమోదముద్ర వేశారని తెలిపారు. 40 మీటర్ల రోడ్డుకు, సెంటాస్ రోడ్డుకు, ఇందిరమ్మ కాలనీకి సంబంధించి డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వ విప్ శ్రీనివాస్ చెప్పారు. అభివృద్ధిలో భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక మ్యాప్ తయారు చేశామన్నారు. భీమవరం పట్టణం జిల్లా కేంద్రంగా అవతరించడంతో పట్టణాన్ని మరింత ఆధునీకరణ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి మునిసిపల్ ప్రత్యేక అధికారి శ్రీనివాసులురాజుతో ఎమ్మెల్యే శ్రీనివాస్ ఫోన్‌లో చర్చించారు. సమావేశంలో మునిసిపల్ ఏఈలు సత్యనారాయణ, కృష్ణమూర్తి, రవితేజ, శరత్, ఇరిగేషన్ ఏఈ వినయ్ పాల్గొన్నారు.

ఇంధనాన్ని ఆదా చేయాలి


విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎలక్ట్రికల్ ఈఈ అహ్మద్‌ఖాన్

భీమవరం: భావితరాల అవసరాల కోసం ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యుత్‌శాఖ డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. భీమవరం కేజీఆర్‌ఎల్ ఫార్మసీ కళాశాలలో శనివారం ఇంధనపొదుపు వారోత్సవాల్లో భాగంగా ఎలక్ట్రికల్‌శాఖ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏడీఈ రాజగోపాల్‌చౌదరి, ఏఈలు శ్రీనివాసరాజు, పద్మ, అప్పారావు, ఫార్మసీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నిర్మల, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం పంపిణీ


వేండ్ర అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్, సచివాలయం సిబ్బంది

పాలకోడేరు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నప్పటికీ పోషకాహార పంపిణీ ఆగలేదు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సచివాలయం ఉద్యోగులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వలంటీర్లు ప్రజా ప్రతినిధులు, పంచాయతీ వార్డ్ మెంబర్స్ సమక్షంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేశారు. సోమవారం నుంచి ఒక్కో సచివాలయం ఉద్యోగిని ఏర్పాటు చేసి ప్రీ స్కూల్ పిల్లలకు కూడా పూర్తిస్థాయిలో ఫీడింగ్ ఇస్తామని ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వాణి విజయ రత్నం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి విజయలక్ష్మి, వీఆర్వో నాగమల్లేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి కడలి భవాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి, సచివాలయం ఉద్యోగులు మహిళా పోలీసులు వలంటీర్లు పాల్గొన్నారు.

సాబ్జి మృతికి సంతాపం

ఉండి: ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి అంగన్‌వాడీ కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధనికొండ శ్రీనివాస్, ఎం చైతన్య మాట్లాడుతూ మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు సాబ్జి అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. కొంట్లాడ వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

27 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

భీమవరం: మున్సిపల్ కార్మికులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఆప్కాస్ కార్మికులు ఇంజినీరింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 27 నుంచి సమ్మె చేయనున్నట్టు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కిల్లారి మల్లేశ్వరావు, భీమవరం అధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసు స్థానిక మునిసిపల్ కమిషనర్ ఎం శ్యామలకు అందజేశారు. యూనియన్ నాయకులు నీలపు శ్రీను, ఆశీర్వాదం, రెల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఏఎంసీ మాజీ చైర్మన్ ఏడుకొండలు


కొమరాడలో మహిళకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ఏడుకొండలు

భీమవరం అర్బన్: ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారిని దృష్టిలో పెట్టుకుని నవరత్నాలు ద్వారా రూ.50 వేలు నుంచి రూ.10 లక్షలు వరకు లబ్ధి చేకూర్చారని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు అన్నారు. భీమవరం మండలం కొమరాడ గ్రామంలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా రెండో రోజు వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాల లబ్ధి, రాష్ట్ర అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, రైతు భరోసా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు 40 నుంచి 60 సంవత్సరాల్లోపు మహిళలకు ఏడాదికి రూ.18,750, కాపు మహిళలకు రూ.15 వేలు, రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఆటో వాలాలకు రూ.10 వేలు, చేనేత వృత్తిదారులకు రూ.24 వేలు అందించి గత నాలుగున్నరేళ్లలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99.5 శాతం సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని వివరించారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించడంతో పాటు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేశారని తెలిపారు. మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ కొట్టి కుటుంబరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నిరంతం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందడంతో ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు అండగా ఉండి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాట్నాల రామకృష్ణ స్వామి, వీర వెంకట సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు బేతాళ సంతోష్, రాట్నాల సత్యనారాయణ, రాట్నాల నాగేశ్వరరావు, మద్దా సంపత రావు, పొడపాటి బెన్ని, తాళ్లారి సామ్యేయేల్, రాట్నాల రామకృష్ణ, పొడపాటి థామస్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

పెనుగొండ: జిల్లా విద్యాశాఖాధికారి వెంకటరమణ పెనుగొండలోని ప్రైవేటు స్కూల్లో శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ కొమ్ముల రామకృష్ణ, చైర్మన్ కొల్లాటి పెద్దిరాజు, ప్రిన్సిపాల్ జెమిమా, పీఈటీ వెంకటేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి షష్ఠి మహోత్సవాలు


శ్రీరామపురం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక శ్రీరాంపురం రామలింగేశ్వర స్వామి దేవస్థానం (సుబ్బారాయుడు గుడి)లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కల్యాణ మహోత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 17వ తేదీ నుంచి 21 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఆలయం వద్ద క్యూలైన్లు, విద్యుత్ దీపాలంకరణ, భక్తులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణ అధికారి దండు కృష్ణంరాజు మాట్లాడుతూ ఈనెల 17న స్వామివారికి అభిషేకాలు, ధ్వజారోహణ, 18న తెల్లవారు జామున 1.30 నిమిషాల నుంచి స్వామివారి దర్శనం, అభిషేకాలు, 19న తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా రథోత్సవం, 20న రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 21న స్వామివార్లకు త్రిశూల స్నానోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులంతా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

దేవస్థానానికి మార్గం ఇలా..

భీమవరం జువ్వలపాలెం రోడ్డు రాము స్వీట్ షాపు నుంచి డీఎన్‌ఆర్ కళాశాల క్రీడా మైదానం రోడ్డులో ఉన్న హస్సీ కల్యాణ మండపం పక్క రోడ్డులో దేవస్థానం ఉంటుంది.

పంచాయతీ శాఖలపై అవగాహన అవసరం

ఉండి: గ్రామ పంచాయతీలోని ప్రతి అంశం, ప్రతిశాఖపైనా అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలని డీపీఓ జీవీకే మల్లికార్జునరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు సాధారణ పరిపాలన, ఆదాయ వ్యయాలు, ఆస్తుల సంరక్షణ, ప్రజారోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఓటు హక్కును సద్వినియోగించుకోవాలి


ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ మల్లికార్జునరావు

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీపీఓ మల్లికార్జునరావు అన్నారు. పాలకోడేరులో శనివారం సాయంత్రం ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పోలింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నొక్కిన గుర్తు స్క్రీన్ పై కనిపిస్తుందో లేదో సరి చూసుకోవాలని సూచించారు. స్థానికులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కాకర్లమూడి నాగేంద్ర కుమార్, ఇన్‌చార్జి ఏపీఎం ఎం భారతి, సీసీ కట్టమాధవి, ఆర్‌ఐ నాగభూషణం నాయుడు, పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజు, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టి మోషే మృతి

పెనుగొండ: మాల మహానాడు మండల మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిట్టి మోషే (65) మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుండె పోటు రావడంతో ఆసుపత్రికి వెళ్లకుండానే ప్రాణాలు విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం మోషే మృత దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.